చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్


నమూనాలను తిలకిస్తున్న జయేష్‌రంజన్

సనత్‌నగర్: విద్యార్థి దశలోనే వారిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సాహాన్ని అందించాలని ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ ఉపాధ్యాయులకు సూచించారు. బేగంపేటలోని గీతాంజలి పాఠశాలలో విద్యార్థులు సాంకేతిక అంశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక అంశాలకు సంబంధించి విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించి అభినందించారు. ముఖ్యంగా విద్యార్థులు తమ సృజనతో తయారుచేసిన యానిమేషన్, ఏరోడైనమిక్స్, ఏవీయేషన్ స్టీమ్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అంశాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల మేధస్సు, నైపుణ్యం తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు రాణించి దేశం గర్వించే స్థాయిలో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గీతాంజలి స్కూల్ డైరెక్టర్ గీతాకరణ్, ప్రిన్సిపాల్ మాయా సుకుమారన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


వర్క్‌షాపు ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి, శ్రీదేవి

గాంధీఆస్పత్రి : దీర్ఘకాల నొప్పులకు చికిత్స అందించే పెయిన్ మేనేజ్‌మెంట్‌పై వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుని, రోగులకు మేలైన సేవలు అందించాలని వైద్య నిపుణులు సూచించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి అనస్తీషియా విభాగం, గాంధీ గ్లోబల్ అలుమ్నీ సంయుక్త ఆధ్వర్యంలో పెయిన్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్, లైవ్ డెమోలను శనివారం నిర్వహించారు. గాంధీ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి, గ్లోబల్ అలుమ్నీ ప్రెసిడెంట్ రామ్ పసుపులేటి, ప్రొఫెసర్ శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఊబకాయం, జంక్‌ఫుడ్, శారీరక శ్రమ లేకపోవడం, ఎముకల అరుగుదల, ఆహారపు అలవాట్లు, వయసురీత్యా పలు రకాల నొప్పులు బారిన పడుతున్నారని, బ్యాక్ పెయిన్ (నడుంనొప్పి), మోకాళ్ల నొప్పులతో ఎక్కువ మంది బాధపడుతున్నారని ఈ నొప్పులు ఎందుకు వస్తాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన వైద్య విధానాలు, పద్ధతులు, ఆధునిక మెళకువలు తదితర అంశాలపై వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం లైవ్ అండ్ వీడియో డెమో నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో గాంధీ అనస్తీషియా, న్యూరోసర్జరీ హెచ్ఓడీలు బేబిరాణి, ప్రకాశరావు, గాంధీ అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి, లింగయ్య, ప్రతాప్ రెడ్డి, నిమ్స్ హెచ్ఓడీ పద్మజదుర్గా, వైద్యులు కామేశ్వరరావు, మురళీధర్‌జోషి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ప్రజావసరాలకు వినియోగించాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ప్రజావసరాలకు వినియోగించాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మిని శనివారం ఆమె కలిసి వినతిపత్రం అందించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్, లైబ్రరీలు ఏర్పాటు చేసేందుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి సర్వే చేయించాలని లేకపోతే అవి అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉందన్నారు. డివిజన్ పరిధిలో ఆటస్థలాలు, లైబ్రరీలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు త్వరితగతిన చెక్కులు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డంప్రసాద్, కన్న తదితరులు పాల్గొన్నారు.

జెక్‌కాలనీలో ఫుడ్ ఫెస్టివల్

సనత్‌నగర్: కాలనీ మహిళలంతా ఏకమై రుచికరమైన వంటకాలు తయారుచేసి వావ్ అనిపించారు. జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాలనీ మొదటి వీధిలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ విశేషంగా ఆకట్టుకుంది.వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలు ఇక్కడ ఘుమఘుమలాడాయి. కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత కొలను బాల్‌రెడ్డి సందర్శించి అభినందించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఈఓ అన్నపూర్ణ, ప్రభా అనంతరెడ్డి, అన్నపూర్ణ, శశికళ, శారద వెల్లంకి, భాగ్యలత, వాణి, అమరావతి సమన్వయంతో విజయవంతంగా ఫుడ్‌ఫెస్టివల్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్‌రావు, శివారెడ్డి, వెంకటేశ్వర్, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, డీఏస్‌రావు, రామసుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.


ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రతినిధులు

హెచ్‌ఎండీఏ కుంభకోణంలో కేటీఆర్ హస్తం

చనగాని దయాకర్


మట్లాడుతున్న చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌ఎండీఏలో జరిగిన రూ.500 కోట్ల కుంభకోణంలో మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవిందకుమార్ హస్తం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పరిశోధక విద్యార్థి చనగాని దయాకర్ ఆరోపించారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిసర ప్రాంతాల్లో కోట్లు విలువ చేసే భూములను కేటీఆర్ ఆయన బృందం హస్తగతం చేసుకుందన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ, మిషన్ భాగీరథ, మిషన్ కాకతీయ తదితర ప్రాజెక్టుల నిర్మాణాల పేరుతో ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. ఏడేళ్ల పని చేసిన బాలకృష్ణ వేల ఎకరాలకు ఇచ్చిన లే ఔట్లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఉన్న ఐఏఎస్ ఆఫీసర్ అరవిందకుమార్, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా నియమించి కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి పాలనపై బహిరంగ రంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మెడ శ్రీను, సుమన్‌గౌడ్, స్వాతి, సైదులు, మహేందర్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ప్రకాశంనగర్ (ఎక్స్‌టెన్షన్) నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రకాశంనగర్ (ఎక్స్‌టెన్షన్) నూతన కార్యవర్గ సభ్యులు

సనత్‌నగర్: రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రకాశంనగర్ (ఎక్స్‌టెన్షన్) అధ్యక్షుడిగా షేక్‌గౌస్ మరోసారి నియమితులయ్యారు. గత 20 ఏళ్లుగా బస్తీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకుంటున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా ఓంస్వామి, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అఫ్రోజ్ అహ్మద్, మహ్మద్ ఇషాక్, జాయింట్ సెక్రటరీలుగా మహ్మద్ జిబ్రాన్‌ఖాన్, కృష్ణారావు, మహ్మద్ సిద్దిక్ అలీ, గోవింద్ రావు, కోశాధికారిగా షేక్ రిజ్వాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మహ్మద్ అహ్మద్, మహ్మద్ ముక్తార్, చీఫ్ అడ్వైజర్‌గా చిలుకూరి శ్రీనివాస్, సలహాదారులుగా మహ్మద్ ఖలీల్, మహ్మద్ అస్లాంఖాన్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పదికి ప్రత్యేక బోధన

- కొనసాగుతోన్న స్పెషల్ క్లాసెస్
- ఉదయం 5 గంటలకే వేకప్ కాల్స్
- చదువులో వెనుకబడిన వారిని ముందుకు తెచ్చేలా ప్రణాళికలు
- సహకరిస్తున్న తల్లిదండ్రులు


బేగంపేట బస్తీ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

సనత్‌నగర్: పాఠశాల విద్యకు పదో తరగతి మైలురాయి లాంటిది. ఇక్కడి ప్రతిభ గీటురాయిగా నిలిస్తేనే కళాశాల విద్యకు ఎర్రతివాచీలను పరుస్తుంటాయి. అందులోనూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10 జీపీఏ తెచ్చుకున్నారంటే కార్పొరేట్ కళాశాలలు సైతం ఆ విద్యార్థుల కోసం పరుగులు తీస్తుంటాయి. ఉచిత విద్య అందిస్తామంటూ తాయిలాలు ప్రకటించేయడం పరిపాటి. ఇదంతా బాగా చదివే విద్యార్థుల వరకు ఓకే. వెనుకబడిన విద్యార్థులను సైతం ముందు వరుసలోకి తీసుకువచ్చి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. అమీర్‌పేట మండల పరిధిలోని డీకే రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వెంగళరావు, ఎల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 180 మంది పదో తరగతి చదువుతున్నారు. అలాగే బాలానగర్ మండల పరిధిలోని సనత్‌నగర్ రౌండ్‌టేబుల్ స్కూల్, అశోక్‌కాలనీలోని సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో 97 మంది, ఉర్దూ మీడియంలో మరో 18 మంది పది పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇక సికింద్రాబాద్ మండల పరిధి కిందికి వచ్చే బేగంపేట బస్తీ ప్రభుత్వ పాఠశాల, పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాల, బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని ప్రభుత్వ పాఠశాల, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్లలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 400 మంది విద్యార్థులకు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం సాయంత్రం అదనంగా ఓ గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

వారిపై ప్రత్యేక ఫోకస్..

చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై అధ్యాపక బృందం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్, డీఈఓలు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి దీనిపై దిశా నిర్దేశం కూడా చేశారు. గతేడాది ఫలితాల కన్నా నూటికి నూరు శాతం రాబట్టడమే లక్ష్యంగా పని చేయాలని సూచనలు సైతం చేశారు. ముఖ్యంగా సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఎక్కువగా తప్పుతున్నారని ఆ రెండు సబ్జెక్టులపై పట్టు సాధించేలా విద్యార్థులను ఏ విధంగా తీర్చిదిద్దాలో రీసోర్స్‌పర్సన్‌చే సూచనలు ఇప్పించినట్లు తెలిసింది. ఆ మేరకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారి భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్

పాఠశాలలోనే కాకుండా ఇంటి వద్ద కూడా చదువుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఈ మేరకు ఉదయం 5 గంటలకే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి వారి పిల్లలను నిద్రలేపి చదివించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కసారి లేపిన తర్వాత మళ్లీ ఫోన్ చేసి చదువుతున్నారా? లేదా అని ఆరా తీస్తున్నారు. ఈ సారి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే పట్టుదలతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు పట్టుదలతో ఉన్నట్లు సికింద్రాబాద్ డిప్యూటీ డీఈఓ చిరంజీవి తెలిపారు.

ఉన్నతాధికారులు సైతం..

విద్యాశాఖ పరంగా నవంబర్, డిసెంబర్ నెలల నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభిస్తారు. కానీ కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమకు తాము ప్రత్యేక చొరవ తీసుకుని విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పది పరీక్షలకు సన్నద్ధం చేస్తుంటారు. పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులతో స్లిప్ టెస్టులతో పాటు రీసోర్స్ పర్సన్స్ తయారు చేసిన పరీక్షా పేపర్ల ఆధారంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థులు ఎక్కడ వెనుకబడి ఉన్నారో గుర్తిస్తూ వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతుండగా 15 వరకు ప్రత్యేక తరగతుల నిర్వహణ పకడ్బందీగా కొనసాగేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 19, క్యారెట్ 19, దొండ 21, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 50, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 60, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: పాటిగడ్డ, బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ప్యారడైజ్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు బుద్ధభవన్ ఫీడర్, రాణిగంజ్ ఫీడర్ల పరిధిలోని బుద్ధభవన్, నల్లగుట్ట స్కూల్, పోచమ్మ దేవాలయం, మొఘల్ క్యాస్టిల్, నల్లగుట్ట మసీద్ ప్రాంతాలు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జీరా, హనుమాన్ టెంపుల్ ఫీడర్ల పరిధిలోని రాణిగంజ్ బస్‌డిపో, అంబేడ్కర్‌నగర్, హనుమాన్ దేవాలయం ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ డబుల్ బెడ్రూమ్, జస్ట్ హోటల్, పీఎం సుందరం మోటర్స్, హనుమాన్ దేవాలయం, బుద్ధభవన్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు హైదర్‌బస్తీ ఫీడర్ పరిధిలోని హైదర్‌బస్తీ, డిజిటల్ రోడ్, సత్యనారాయణ టెంపుల్, ఆంధ్రా బ్యాంక్ లేన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేన్, ఆర్పీరోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఉంటుందన్నారు.

తప్పిపోయిన కుక్కపిల్ల అప్పగింత

లాలాపేట: సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన జగత్ అనే వ్యక్తికి చెందిన మాక్స్ అనే పెంపుడు కుక్కపిల్ల తప్పిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజీల ఆధారంగా పార్శీగుట్టలో గుర్తించి యజమానికి అందజేశారు.

జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్‌గా సాయిమధుకర్



చిలకలగూడ: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీసెల్ చైర్మన్‌గా సాయిమధుకర్ నియమిస్తూ టీపీసీసీ ఎస్సీసెల్ చైర్మన్ ప్రీతం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సికింద్రాబాద్‌కు చెందిన సాయిమధుకర్ గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో పలు కీలక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థి విభాగ ప్రతినిధి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్టేట్ యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా సాయిమధుకర్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

కోదండరామ్‌కు అభినందనల వెల్లువ


ప్రొ.కోదండరామ్‌తో వీసీలు, ప్రొ.లింబాద్రి


కోదండరామ్‌ను సన్మానిస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రితో పాటు వివిధ వర్సిటీల వీసీలు అభినందనలు తెలిపి వర్సిటీల సమస్యలపై చర్చించారు.

ఆల్ వర్సిటీస్ పార్ట్‌టైమ్ అధ్యాపకులు..

లాలాపేట: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొ. కోదండరామ్‌ను శనివారం ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం అసోసియేషన్ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ బోనకుర్తి, ఆరుట్ల జానకిరెడ్డి, మౌలాలీ,కరుణాకర్, పాలడుగు జీవన్, ఏడుకొండలు, ఆనంద్,సైదులు, హర్షవర్ధన్, మహేశ్,శివ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్: ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొ. కోదండరామ్‌ను శనివారం ఆర్టీసీ జేఏసీ నాయకులు, టీజేఎస్ నాయకులు పాకాల ప్రభాకర్, నాగరాజు, ప్రకాష్, మహిమదాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పూలే విగ్రహ ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత అత్యుత్సాహం


మాట్లాడుతున్న మహేష్‌యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయవంతంగా కొనసాగుతున్న ఆరు గ్యారంటీల అమలుతో కాంగ్రెస్ పాలన పై ప్రజల్లో పెరుగుతున్న ఆధారణను చూసి ఓర్వలేక ఎమ్మెల్సీ కవిత పూలే విగ్రహం ఏర్పాటును రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ట్యాంక్‌బండ్‌పై పూలే విగ్రహ ఏర్పాటుకు గతంలో అనేకసార్లు మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదని పైగా బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక విధాలుగా అన్యాయం చేసిందన్నారు. ఎమ్మెల్సీ కవితకు రాజకీయ ప్రయోజనాలే తప్ప మహనీయుల విగ్రహాల ఏర్పాటుపై చిత్తశుద్ధి లేదన్నారు.

దళితుల సమస్యలపై పోరాడుతా


నియామకపత్రాన్ని అందుకుంటున్న శివకుమార్

అడ్డగుట్ట: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడిగా శాంతినగర్‌కు చెందిన దొమ్మాటి శివకుమార్ నియమితులయ్యారు. సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని నియోజకవర్గంలో దళితుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అంబేడ్కర్ యువజన సంఘాన్ని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవి కేటాయించిన సంఘం నాయకులు, సహకరించిన గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కాదారం వినయ్ కుమార్, సదా మహేష్, జక్కుల అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాంగోపాల్‌పేట్: కళాసీగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980-81 పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. సుమారు 40 మంది వరకు పూర్వ విద్యార్థులు కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. పాఠశాల అభివృద్ధికి వాసవి క్లబ్ సికింద్రాబాద్ సహకారంతో రూ.5 లక్షలు ఖర్చు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ పాల్గున, గిరి, రాఘవేందర్, కే జగన్, పూర్ణచందర్, రామకృష్ణ, పబ్బా ప్రకాష్, పరుషురాం, వాసవి క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, వీసంశెట్టి మనోజ్ పాల్గొన్నారు.

బంగారమ్మా!



బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శతచండీ యాగ సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వాహణ అధికారి నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బంగారు చీరతో అలంకరించారు. జగద్గురువు ఆది శంకరాచార్య కంచికామ కోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ ఉత్సవాలకు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. – అమీర్‌పేట

మానవత్వం చాటిన 'టీటీఐ' సిబ్బంది



సనత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ఓ క్షతగాత్రుడికి టీటీఐ సిబ్బంది ఒకరు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. కరీంనగర్‌కు చెందిన పెంజర్ల దేవరాజు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతనికి అత్యవసరంగా 'ఓ' గ్రూపు రక్తం అవసరం ఉండగా విషయం తెలుసుకున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు అదే గ్రూపు రక్తం కలిగిన తన సిబ్బంది అయాన్‌తో మాట్లాడి రక్తదానం చేసేలా చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన అయాన్‌ను సన్మానించి ప్రశంసాపత్రం అందించారు.

ఓయూ వీసీ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్ దిష్టిబొమ్మను శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట వివిధ విద్యార్థి సంఘాల నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓయూ హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కరువైందన్నారు. గత నెల క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లోకి, ఈ నెల 26న సికింద్రాబాద్ పీజీ కాలేజీ లేడీస్ హాస్టల్‌లోకి ఆగంతకులు చొరబడి విద్యార్థినులను భయాభ్రాంతులకు గురి చేశారని పేర్కొన్నారు. వీసీ పాలన భవనం చుట్టూ ముళ్ల కంచెతో మూడంచెల భద్రత వలయాన్ని నిర్మించుకొని హాస్టల్ విద్యార్థినులను రక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే వీసీ పదవీ నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

సైనికులకు విద్యార్థుల శుభాకాంక్షలు




లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిల పాఠశాల 5,6,7 తరగతులకు చెందిన విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌సీసీ జీపీహెచ్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. కల్నల్ పంకజ్ శర్మ, కల్నల్ అనీల్, కల్నల్ శ్రీకాంత్ నాథన్, ఎన్‌సీసీ అధికారులను కలిసి భారత గణతంత్ర 75 ఏళ్ల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సైనిక అధికారులు మాట్లాడుతూ.. ప్రజాస్వామిక అంశాలపై విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. సైనిక వ్యవహారాలపై విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం


బోర్‌వెల్ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఈదమ్మ-మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో బోర్‌వెల్ పనులు ప్రారంభమయ్యాయి. దేవాలయంలో బోర్ లేకపోవడంతో భక్తులు పడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. దీనికి స్పందించిన కిషన్‌రెడ్డి తన ఎంపీ నిధులతో బోర్‌వెల్ నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు శనివారం ప్రారంభమయ్యాయి. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్, సీనియర్ నాయకులు దయానంద్, మూల రవీందర్, లక్ష్మీనారాయణ, సిర్మనీ నరేష్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పనులను పరిశీలించారు.

వయోవృద్ధురాలికి సన్మానం


జగత్‌లక్ష్మిని సన్మానిస్తున్న కొండల్‌రావు, జేఎస్‌టీ శాయి

సనత్‌నగర్: మోడల్‌కాలనీకి చెందిన 92 ఏళ్ల జగత్‌లక్ష్మిని శనివారం కాలనీ పార్కులో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ఆధ్వర్యంలో సన్మానించారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు, నలుగురు మనుమళ్లు, ఆరుగురు మనుమరాళ్లు, ముగ్గురు మునిమనుమరాళ్లు, ఒక మునిమనువడితో కలిసి మొత్తం 20 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, కృష్ణశాస్త్రి, వెంకటేశ్వరశర్మ, నాగమణి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మర్చిపోయిన బ్యాగు అప్పగింత



రాంగోపాల్‌పేట్: ఆటోలో వెళ్తున్న ఓ మహిళకు చెందిన బంగారు నగలు ఉండే బ్యాగు కిందపడిపోయింది. గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ దానిని గోపాలపురం పోలీసుల ద్వారా సదరు మహిళకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. చందానగర్‌కు చెందిన టీచర్ అన్నపూర్ణ శనివారం సాయంత్రం 5గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి చందానగర్‌కు వెళ్తుంది. రెతిఫైల్ బస్టాండ్ వద్ద రామిరెడ్డి స్వీట్ హౌజ్ వద్దకు రాగానే ఆటోలో ఉన్న బ్యాగు కింద పడిపోయింది. దీన్ని ఆమె గమనించకుండా అలాగే వెళ్లిపోయింది. అక్కడే విధుల్లో ఉన్న గోపాలపురం ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రభు బ్యాగును పరిశీలించగా అందులో రూ.5లక్షల విలువ చేసే బంగారు నగలు ఉన్నాయి. వెంటనే ఆయన ఆ బ్యాగును తీసుకుని గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే ఆమె బ్యాగు పడిపోయిన విషయం గమనించి గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. ఈ బ్యాగును పోలీసుల సమక్షంలో ఆమెకు అప్పగించారు.